సాక్షి
నల్లగొండ
ఆదివారం । 22 । జూన్ । 2025



### అంతరాలు దూరం
విజ్ఞానంతో సామాజిక అంతరాలు దూరమవుతాయని రాష్ట్ర ఎస్సీ. ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. - 8లో



### ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి
స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. - 8లో



### ఇద్దరు నిందితుల రిమాండ్
నకిలీ పత్తి విత్తనాల కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. - 8లో

## న్యూస్‌రీల్

### రైతు భరోసా రూ.592.55 కోట్లు జమ
నల్లగొండ అగ్రికల్చర్ : రైతు భరోసా పథకం కింద జిల్లాలో శనివారం వరకు 4,97,280 మంది రైతులకు రూ.592.55 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వ్యవసాయ సాగుకు పెట్టుబడికి వినియోగించుకునేందుకు ప్రభుత్వం ఈ ఆర్థిక సాయాన్ని అందజేస్తోందని పేర్కొన్నారు. విడతల వారీగా రోజూ కొంతమంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో నిధులను జమ చేస్తోందని తెలిపారు.

### భవిత కేంద్రం ఆకట్టుకునేలా ఉంది



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ : నల్లగొండలోని భవిత కేంద్రం అందరిని ఆకట్టుకునేలా ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రం ఆధునీకరణ పనులను శనివారం ఆమె పరిశీలించిన మాట్లాడారు. ఆధునీకరణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. భవిత కేంద్రం పిల్లలను ఆకట్టుకునే విధంగా ఉందని కేంద్రంలో ఉన్న విద్యార్థుల వివరాలను ఎంఈఓ అరుంధతిని కలెక్టర్ అడిగారు. అనంతరం కలెక్టర్ స్త్రీ శక్తి భవన్‌ను, ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ రోహిత్, ఏపీఎం వినోద ఉన్నారు.

### 24న జాబ్ మేళా
రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీలో ఈ నెల 24న అప్రెంటిషిప్, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.దస్రూనాయక్, ప్రిన్సిపాల్ ఎం.షీబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పారా మెడికల్ కోర్సు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నాన్ పారామెడికల్ కోర్సు విద్యార్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ తేవాలని సూచించారు.

### బీఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వాలి
నల్లగొండ : బీఎల్‌ఓలకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి బూత్‌స్థాయి అధికారుల విధులు, బాధ్యతలు, కొత్త ఓటర్ల నమోదు, సవరణలపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాస్టర్ ట్రైనర్లకు ఈఆర్‌ఓలు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో సాగర్ నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.



### క్రమశిక్షణ.. కఠోర సాధన
ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదంటూ నిరూపించేలా తీర్చిదిద్దుతోంది ఆర్మీ బేస్డ్ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల. బాలికలను ఉన్నత చదువు వైపు మళ్లించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఈ కళాశాలలో ప్రవేశానికి ప్రస్తుతం నోటిఫికేషన్ వెలువడింది.

వివరాలు 8లో

యోగ మయం



యోగాసనం వేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శనివారం నల్లగొండలో ఎంవీఆర్ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, విద్యార్థులు



జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ..

# పంద్రాగస్టు నాటికి పరిష్కారం!

- రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,01,605 దరఖాస్తులు
- వాటి పరిశీలన ప్రారంభించిన అధికారులు
- మండల స్థాయిలోనే కేటగిరీల వారీగా విభజన
- తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో ఆగస్టు 15 నాటికి పరిష్కరించేలా ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : భూ భారతి చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి పరిష్కరించనున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 20 వరకు 17 రోజుల పాటు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,01,605 దరఖాస్తులు వచ్చాయి. దాదాపు 15 రకాల సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారంతో రెవెన్యూ సదస్సులు ముగియడంతో అధికారులు దరఖాస్తుల పరిశీలన ప్రారంభించారు. ఆగస్టు 15లోగా అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

**దరఖాస్తుల వివరాలు**

| జిల్లా | దరఖాస్తులు |
|---|---|
| నల్లగొండ | 42,534 |
| సూర్యాపేట | 44,741 |
| యాదాద్రి | 14,330 |
| మొత్తం | 1,01,605 |



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

**1,136 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,136 రెవెన్యూ గ్రామాల్లో భూ భారతి గ్రామసభలు నిర్వహించారు. మొత్తం 1,01,605 దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించారు. అయితే ఇందులో అత్యధికంగా మిస్సింగ్ సర్వే నంబర్లు, ఫౌతితో పాటు అసైన్డ్ భూముల సమస్యలు, పెండింగ్ మ్యుటేషన్‌పైనే దరఖాస్తులు అధికంగా వచ్చాయి.

**ప్రారంభమైన దరఖాస్తుల పరిశీలన..**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో పెద్ద ఎత్తున భూ సమస్యలు పేరుకుపోయాయి. వాటిని పరిష్కరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం ధరణిని రద్దు చేసి భూ భారతిని తీసుకొచ్చింది. అన్ని భూ సమస్యలను పరిష్కరించేలా భూ భారతిలో ఆప్షన్లను సిద్ధం చేసింది. 20వ తేదీ వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. సదస్సులు ముగియడంతో అధికారులు దరఖాస్తులను కేటగిరీల వారీగా విభజించి పరిశీలిస్తున్నారు.

**సాదాబైనామాలు పెండింగేనా..!**

ప్రభుత్వం అన్ని రకాల భూ సమస్యలను ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించింది. అయితే సాదాబైనామాల విషయం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. అవి తప్ప మిగిలిన సమస్యలన్నింటికీ ఆగస్టు 15 నాటికి పరిష్కారం చూపనున్నారు. ఆలోగా సాదాబైనామాలను పరిష్కరించేలా హైకోర్టు ఉత్తర్వులు ఇస్తే వాటిని కూడా పరిష్కరించే అవకాశం ఉంది.

**ఆయా స్థాయిలో పరిష్కారం**

చిన్న చిన్న సమస్యలకు మండలస్థాయిలోనే తహసీల్దార్ నేతృత్వంలో పరిష్కరించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఆర్డీఓ స్థాయిలో మ్యుటేషన్, ఫౌతిలను పరిష్కరిస్తారు. పెద్ద సమస్యలు ఉంటే కలెక్టర్ స్థాయిలో పరిష్కరించాల్సి ఉంటుంది. కలెక్టర్ స్థాయిలో కాని వాటిని సీసీఎల్‌కు పంపనున్నారు. సమస్యల విషయంలో బాధితులను పిలిపించి రికార్డులను పరిశీలించి కొన్నింటిని పరిష్కరించే అవకాశం ఉంటుంది. మరికొన్నింటి విషయంలో దరఖాస్తుల ఆధారంగా వారికి నోటీసులు ఇచ్చి రెవెన్యూ బృందాలు గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో అన్నీ పరిశీలించి అక్కడే పరిష్కరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

## హోర్డింగ్‌లను తక్షణమే తొలగించాలి

సాక్షి ఎఫెక్ట్..

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలోని నేషనల్ హైవే డివైడర్లపై అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్స్‌ను వెంటనే తొలగించాలని ఆర్ అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.యుగంధర్ శనివారం మిర్యాలగూడ ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈనెల 19న 'సాక్షి'లో 'హైవేపై అనధికారిక ప్రకటనలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన నేషనల్ హైవే -167, ఆర్అండ్‌బీ అధికారులు నేషనల్ హైవే పరిధిలోని డివైడర్ల మధ్య ఎలాంటి ప్రచార హోర్డింగ్స్ ఏర్పాటు చేయొద్దని, వాటి వల్ల వాహనదారుల దృష్టి మరలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. హైవే నిబంధనలు, రోడ్డు భద్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులు ఎలాంటి టెండర్లు ఆహ్వానించవద్దని, ప్రస్తుతం ఉన్న బోర్డులను వెంటనే తొలగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రకటన ఏజెన్సీలతో అవగాహన ఒప్పందం ఉంటే వాటిని వెంటనే రద్దు చేసుకోవాలని సూచించారు.

## స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలి



నల్లగొండలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. శనివారం నల్లగొండలోని వీటీ కాలనీలో ఉన్న క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి ఎంతో ముఖ్యమైనవని, అత్యధిక స్థానాలు కైవసం చేసుకునే దిశగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కటికం సత్తయ్యగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, చీర పంకజ్‌యాదవ్, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, ఐయితగాని యాదయ్య, దేప వెంకట్‌రెడ్డి వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నకిరేకల్‌కు నేడు మంత్రుల రాక



మినీ స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : నకిరేకల్‌కు ఆదివారం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకటి శ్రీహరి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి రానున్నారు. నకిరేకల్ పట్టణంలో నిర్వహించేఉ సభలో నియోజకవర్గానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నారు. ఇందుకోసం పట్టణంలోని మినీ స్టేడియం మైదానాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. స్టేడియంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వారి వెంట అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ జమురుద్దీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.

## ఎరువుల సరఫరాలో అవకతవకలు జరగొద్దు

నల్లగొండ అగ్రికల్చర్ : ఎరువుల సరఫరాలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ హెచ్చరించారు. శనివారం నల్లగొండలోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఎరువుల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్ మొదలై రైతులు వివిధ రకాల పంటలు సాగు చేయడానికి సిద్ధపడుతున్నారని.. పంటలకు అవసరమైన అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యూరియా 29,067 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,425 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 28,102 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు. ఈ నిల్వలు జూలై నెల వరకు సరిపోతాయన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి పంటలకు వారు చెప్పిన మోతాదులో ఎరువులు ఉపయోగించి అధిక దిగుబడి పొందాలన్నారు. సమావేశంలో ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రామగిరి(నల్లగొండ) : ప్రముఖ పుణ్య క్షేత్రాలకు ఈ నెల 26, 27వ తేదీల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి తెలిపారు. నల్లగొండలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని డిపోల నుంచి యాత్రీకుల కొరకు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బుకింగ్ కోసం నల్లగొండ : 9160360707, దేవరకొండ : 7382833031, మిర్యాలగూడ : 9298008888, సూర్యాపేట : 7382836177, కోదాడ : 7780433533, యాదగిరిగుట్ట : 9885103165 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఎం కె. జానిరెడ్డి

**డిపోల వారీగా బస్సుల వివరాలు...**

- నల్లగొండ నుంచి అలంపూర్, బాచుపల్లి, శ్రీరంగపూర్, జటాప్రోలు, సోమశిల, కొల్లాపూర్, సింగోటం.
- దేవరకొండ నుంచి పంచదేవపహాడ్, మక్తల్, మన్యంకొండ, కురుమర్తి, గంగాపూరం, ఊర్కొండపేట, గుల్బర్గా (ఖజా గరీబ్ నవాబ్ దర్గా), హాలేకట్ట (షరీఫ్ దర్గా).
- మిర్యాలగూడ నుంచి ధర్మపురి, కొండగట్టు, వేములవాడ, కాముకెల్లి.
- సూర్యాపేట నుంచి అన్నవరం, ద్రాక్షారామం, అంతర్వేది, పెనుగొండ, ద్వారకా తిరుమల.
- కోదాడ నుంచి అలంపూర్, బాచుపల్లి, శ్రీరంగపూర్, జటాప్రోలు, సోమశిల, కొల్లాపూర్, సింగోటం.
- యాదగిరిగుట్ట నుంచి కొండపోచమ్మ, వరంగల్, కొండగట్టు, వేములవాడ, సిద్దులగుట్ట.

# ఆదిలోనే విపత్తి

- జిల్లాలో ఇప్పటికే 50 వేల ఎకరాల్లో పత్తి సాగు
- ముందస్తు వానలకు విత్తనాలు వేసిన రైతులు
- పక్షం రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు
- సగానికి పైగా మొలకెత్తని గింజలు
- అక్కడక్కడ వచ్చిన మొలకలు వాడు దశకు..
- ఆందోళనలో కర్షకులు



తిప్పర్తి మండలం కాచవారిగూడెం సమీపంలో 15 రోజుల క్రితం పత్తి విత్తనాలు వేసిన చేను



తిప్పర్తి సమీపంలో వాడిపోతున్న పత్తి మొక్క

నల్లగొండ అగ్రికల్చర్, తిప్పర్తి : వర్షాభావ పరిస్థితులు పత్తి రైతుకు శాపంగా మారాయి. పక్షం రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో వేలాది ఎకరాల్లో వేసిన విత్తనాలు మొలకెత్తడం లేదు. దీంతో మరోసారి విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అక్కడక్కడ వచ్చిన మొలకలు ఎండ వేడిమికి వాడు పడుతున్నాయి. సీజన్ ప్రారంభంలోనే ప్రకృతి సహకరించడం పోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

తిప్పర్తి మండల కేంద్రం సమీపంలో ఓ రైతు తనకున్న ఐదెకరాల భూమిలో పది రోజుల క్రితం పత్తి విత్తనాలు విత్తుకున్నాడు. తర్వాత చిరుజల్లులు కురవగా కేవలం 30 శాతం మాత్రమే గింజలు మొలిచాయి. మిగతా గింజలు పాడైపోగా మొలిచిన గింజలు సైతం కొన్ని ఎండ తీవ్రతకు వాడిపోయాయి. దీంతో మరోసారి భూమిని దున్ని విత్తనాలు విత్తుకోవాలా..? లేదంటే గింజలు పాడైపోయిన చోట విత్తుకోవాలా.. ? అన్నది తేల్చుకోలేకపోతున్నాడు. ఇదే పరిస్థితి జిల్లాలోని చాలామంది రైతులకు ఎదురైంది.

**50 వేల ఎకరాల్లో పత్తి సాగు**

జిల్లాలో వానాకాలంలో సాగు చేసే ప్రధాన పంటల్లో పత్తి అగ్రస్థానంలో ఉంటుంది. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5,47,735 ఎకరాల్లో పత్తి సాగు కానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వర్షాలు సకాలంలో, సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో రైతులు ఆశాభావంతో సాగు పనులపై దృష్టి సారించారు. మే చివరి వారంలో కురిసిన తొలకరి వానలు, జూలై మొదటి వారంలో కురిసిన మోస్తరు వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రైతులు 50 వేలకుపైగా ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. ఆ తరువాత పక్షం రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడక్కడ అడపాదడపా జల్లులు మాత్రమే పడ్డాయి. దీంతో సగానికి పైగా విత్తనాలు మొలకెత్తలేదు. అక్కడక్కడ కొంత మేర మొలకెత్తాయి. పది రోజులుగా ఎండ తీవ్రత 35 డిగ్రీల పైన నమోదవుతోంది. వేడి గాలులు వీస్తుండడంతో గింజలు భూమిలోనే మాడిపోయే ప్రమాదం ఏర్పడింది. వచ్చిన మొలకలు సైతం ఎండ వేడికి వాడు పడుతుండటంతో కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. నేల గట్టిపడకుండా గుంటుకలు తోలుతున్నారు. మొలకెత్తని చోట మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి రెండోసారి వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

**సాగు ఖర్చులు ఎకరానికి.. (రూల్లో)**

| | |
|---|---|
| ఎరువులు | 5,000 |
| ఎరువు చల్లడం | 1,000 |
| దున్నకాలకు | 3,000 |
| అచ్చు తోలుటకు | 1,000 |
| విత్తనాలు (రెండు ప్యాకెట్లు) | 3,000 |
| కూలీలకు | 1,200 |
| కలుపు మందు | 2,000 |

**వర్షపాతం ఇలా..**

జూన్ మాసంలో ఇప్పటివరకు 64.3 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా కేవలం 43.0 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. నైరుతి రుతు పవనాలు వచ్చే జూన్ మాసంలో కురిసే వర్షమే రైతులకు మంచి ఆధారం. ఈ నెలలోనే వర్షాలు లేకపోవడంతో సాగు కుంటుపడింది.

**ఎకరాకు రూ.15వేలకు పైగా ఖర్చు**

పత్తి సాగు చేయడానికి రైతులు ఇప్పటికే పెద్ద మొత్తంలో పెటుబడి పెట్టారు. దున్నకాలు మొదలుకొని విత్తనాలు వేసే వరకు ఎకరానికి రూ.15 వేలకు పైనే పెట్టుబడి పెట్టారు. మరో వారం రోజుల్లో వర్షాలు కురువకపోతే ఇబ్బందులు తప్పేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## క్లుప్తంగా

### బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

నడిగూడెం: బైక్ అదుపుతప్పి గుంతలో పడడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మోతె మండలం మామిళ్లగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం నారాయణగూడేనికి చెందిన చింత శ్రీకాంత్(27) మునగాల నుంచి మోతె మీదుగా ఖమ్మంకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఖమ్మం–సూర్యాపేట రహదారిపై మోతె మండలం మామిళ్లగూడెం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో రహదారి వెంట ఉన్న గుంతలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### లారీ ఢీకొని..


శ్రీరాములు (ఫైల్)

మర్రిగూడ: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన వ్యక్తి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన యాచారం శ్రీరాములు(55) అదే గ్రామానికి చెందిన బోయపల్లి శంకర్ వద్ద డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీరాములు శుక్రవారం సంగారెడ్డిలో డీసీఎంలో బొగ్గు లోడ్ చేసుకుని తిరిగి వస్తుండగా.. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వచ్చి డీసీఎంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీరాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీరాములు రెండో కుమారుడు కూడా 2నెలల క్రితం నాంపల్లి మండల కేంద్రం నుంచి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తండ్రి, కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

### చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

నార్కట్‌పల్లి: వేర్వేరుగా చోరీలను పాల్పడిన ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. గతేడాది డిసెంబర్ 22న ఎల్లారెడ్డిగూడెంలో జరిగిన ద్విచక్ర వాహనం చోరీ కేసులో నల్లగొండ మండలం శేషమ్మగూడెం గ్రామానికి చెందిన గాదరి సూర్యను, ఈ నెల 12న చెర్వుగట్టులో కుట్టు మిషన్ చోరీ కేసు కేసులో అదే గ్రామానికి చెందిన కసార్ల శివకుమార్‌ను నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ అరెస్ట్ చేసి నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుళ్లు గిరిబాబు, సత్యనారాయణ, శివశంకర్, తిరుమల్‌ను జిల్లా ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

### బోర్‌వెల్ వాహనంలో డీజిల్ చోరీ

నకిరేకల్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన బోర్‌వెల్ వాహనం నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ చోరీ చేశారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున నకిరేకల్ పట్టణంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని వాసవీనగర్‌లో సామ శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి నూతనంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. తన బోర్‌వెల్ వాహనాన్ని ఆ ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. అతడు కుటుంబంతో కలిసి స్థానిక పద్మానగర్ జంక్షన్ వద్ద నివాసముంటున్నాడు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఇన్నోవా కారులో బోర్‌వెల్ వాహనం వద్దకు వచ్చి డీజిల్ ట్యాంక్‌కు వేసిన తాళాలు పగులగొట్టి సుమారు 300 లీటర్ల డీజిల్ దొంగిలించి పరారయ్యారు. చుట్టుపక్కల వారు శ్రీనివాస్‌రెడ్డికి సమాచారం ఇవ్వడంతో అతడు వాహనం వద్దకు చేరుకుని పరిశీలించి, అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



# క్రమశిక్షణ.. కఠోర సాధన

**రాష్ట్రంలోనే ఏకైక ఆర్మీ బేస్డ్ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల**

- డిగ్రీ చదువుతో పాటు సైనిక శిక్షణ
- సివిల్స్‌లోనూ రాణించేలా బోధన
- ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు సాధిస్తున్న అమ్మాయిలు
- బాలికలను ఉన్నత చదువు వైపు మళ్లించడమే లక్ష్యం
- ఎంపికకు ప్రత్యేక పరీక్ష.. వెలువడిన నోటిఫికేషన్

**సాధారణ డిగ్రీకి భిన్నమైన చదువు.. ఆర్మీలో ఉద్యోగాలు పొందేలా కఠోర శిక్షణ.. సివిల్స్‌లో రాణించేందుకు ప్రత్యేక తర్ఫీదు.. నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా డిబేట్లు.. ఇలా ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదంటూ నిరూపించేలా తీర్చిదిద్దుతోంది.. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాల. (ప్రస్తుతం మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లో కొనసాగుతోంది) డిగ్రీ అకడమిక్ చదువుతో పాటు క్రమశిక్షణ, కఠోర సాధనతో అమ్మాయిలను మెరికల్లా తయారు చేస్తోంది. ఇక్కడ చదవి, శిక్షణ తీసుకున్న అమ్మాయిలు ఎయిర్‌ఫోర్స్, ఆర్మీలో ఉద్యోగాలు పొందుతున్నారు.**

- నల్లగొండ డెస్క్


కళాశాల ఆవరణలో సైనిక శిక్షణ పొందుతున్న విద్యార్థినులు (ఫైల్)

రాష్ట్రంలో చాలా మంది బాలికలు ఇంటర్ తరువాత ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ఈ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుంది. ఈ విషయాన్ని గుర్తించిన అప్పటి గురుకుల పాఠశాలల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. ఇంటర్ పూర్తి చేసిన అమ్మాయిల కోసం సాధారణ డిగ్రీ భిన్నంగా ఉండేలా 2018లో బీబీనగర్‌లో ఆర్మీ బేస్డ్ గురుకుల డిగ్రీ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. బాలికలను చదువు వైపు ఆకర్షించేలా ఈ కళాశాలలో అనేక ప్రత్యేకతలను జోడించారు. ఈ కళాశాలలో చదువుకునే బాలికలకు డిగ్రీ సిలబస్‌తో పాటు ఆర్మీ మాదిరిగా శిక్షణ ఇవ్వడం, సివిల్స్‌కు కూడా సన్నద్ధం చేయాలని నిర్ణయించారు. ఈ కళాశాలలో చదివేందుకు విద్యార్థుల ఎంపిక కూడా ప్రత్యేకంగా ఉండేలా రూపకల్పన చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఈ కళాశాల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్‌కేసర్ వద్ద కొనసాగనుంది.





### ప్రత్యేక టైం టేబుల్..

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించే ఈ గురుకుల కళాశాలలో ప్రత్యేక టైం టేబుల్‌ను అమలు పరుస్తారు. ఉదయం 5 గంటలకే వీరి దినచర్య ప్రారంభిస్తారు. 6 నుంచి 7 గంటల వరకు వ్యాయామంతో కూడిన ఫిజికల్ యాక్టివిటీ ఉంటుంది. 7 గంటలకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. 8 నుంచి 8.45 గంటల వరకు నిన్న జరిగిన అంశాలపై సమీక్ష ఉంటుంది. 8.45 నుంచి 9 గంటల వరకు ప్రార్థన, 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.20 వరకు తరగతులు నిర్వహిస్తారు. 2.20 వరకు భోజన విరామం ఉంటుంది. 2.20 నుంచి 5.30 వరకు సివిల్స్‌కు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇస్తారు. దీనిలో వీరికి ఆంగ్ల భాషపై ప్రావీణ్యంతో పాటు రీజనింగ్ ఇతర అంశాలను నేర్పిస్తారు. ఆ తరువాత అల్పాహారం ఇచ్చి సాయంత్రం 6.30 గంటల వరకు క్రీడల్లో శిక్షణ ఇస్తారు. 6.30 నుంచి 7.30 మధ్య రాత్రి భోజన సమయం ఉంటుంది. ఆ తరువాత 9.30 అకడమిక్ స్టడీ అవర్స్, 9.30 నుంచి 10.30 డిఫెన్స్ స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. డిఫెన్స్ అంశాలపై వారానికి ఒకసారి టెస్ట్ నిర్వహిస్తారు.

### మెరికల్లా తయారు చేయడమే లక్ష్యం

క్రమశిక్షణ, కఠోర శిక్షణతో బాలికలను మెరికల్లా తయారు చేయడంతో పాటు వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే ఈ కళాశాల లక్ష్యం. ఇద్దరు రెగ్యులర్ ఫిజికల్ డైరెక్టర్లతో పాటు ఆర్మీ అంశాలపై శిక్షణ ఇవ్వడానికి ఇద్దరు విశ్రాంత ఆర్మీ అధికారులు కూడా ఉంటారు. ఆర్మీలో వివిధ ర్యాంకులను ఇక్కడి విద్యార్థులకు కేటాయించి వారిని ప్రోత్సహిస్తుంటారు. వారంలో రోజుకో రంగు దుస్తులు ధరించడం ఇక్కడి ప్రత్యేకత. నిత్యం వీరు వాడే భాషలో కూడా ఎక్కువగా ఆర్మీ అధికారులు, సిబ్బంది వాడే పదాలనే ఉపయోగిస్తుంటారు.

### ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా ఎంపికైన కావ్య



సైనిక్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల 2021–2024 బ్యాచ్ విద్యార్థిని వి.కావ్య ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈమె ఈ నెల 28వ తేదీన దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ కార్యాలయానికి వెళ్లి విధుల్లో చేరనున్నారు. కళాశాల నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన మొదటి విద్యార్థి కావ్య.

### ప్రత్యేకంగా ప్రవేశ విధానం

ఈ కళాశాలలో చేరడానికి సాధారణ ఇంటర్ మార్కుల మెరిట్ మాత్రమే సరిపోదు. దీని కోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇస్తారు(ప్రస్తుతం ఆ నోటిఫికేషన్ విడుదలైంది). ఇంటర్ మెరిట్‌తో పాటు వివిధ రకాలైన ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు, మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్ పరీక్షలు నిర్వహిస్తారు. 100 మీటర్లు, 500 మీటర్లు, 50 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తారు. ఎంపిక చేసుకున్న అంశంపై మూడు నిమిషాలు మాట్లాడాలి. సైకాలజీ టెస్ట్‌తో పాటు ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యంపై కూడా పరీక్ష పెడతారు. ఆ తరువాత సాధారణ అంశాలపై ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ అన్ని అంశాల్లో ప్రతిభ చూపిన వారితో మెరిట్ లిస్ట్ తయారీ చేసి విద్యార్థులను ఎంపిక చేసుకుంటారు.

### రిటైర్డ్ జవాన్లతో శిక్షణ ఇప్పిస్తున్నాం

రాష్ట్రంలోని మొట్టమొదటి గురుకుల మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాల ఇదే కావడంతో విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. కళాశాలలో డిగ్రీ కోర్సుతో పాటు విద్యార్థులు ఆర్మీలో ఉద్యోగాలు సాధించేలా ఇక్కడ రిటైర్డ్ ఆర్మీ జవాన్లతో శిక్షణ ఇప్పిస్తున్నాం. ఉదయం, సాయంత్రం శిక్షణ ఉంటుంది. విద్యార్థులు ఉద్యోగాలు పొందే దిశగా ప్రత్యేక శిక్షణ ఇస్తాం.

- నిరూప, కళాశాల ప్రిన్సిపాల్





### అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ పరిధిలో ప్రిన్స్‌టన్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియను ఇటీవల ప్రారంభించారు. ఇంటర్మీడియట్ పాసైన మహిళా అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇంటర్ మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్, 2025 జనవరి తర్వాత పొందిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సమర్పించాలి. ఈ కళాశాలలో ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంజెడ్‌సీ, బీజెడ్‌సీ, బీకాం సీఏ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు 7995010687, 7981199283 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.




గ్రూప్ డిస్కషన్‌లో పాల్గొన్న విద్యార్థినులు (ఫైల్)

## ఆర్మీ డిగ్రీ కాలేజీని బీబీనగర్‌లోనే ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి

మోత్కూరు: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్‌కేసర్‌కు తరలించిన బీబీనగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలను తిరిగి బీబీనగర్‌లోనే ఏర్పాటు చేయాలని కళాశాల పేరెంట్స్ కమిటీ సెక్రటరీ ఎర్రవెల్లి నర్సయ్య ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. భువనగిరి పట్టణానికి వచ్చిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి.. యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరైన మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలను ఈ జిల్లాలోనే నిర్వహించాలని, ఆర్మీ రిటైర్డ్ కెప్టెన్ పర్యవేక్షణలో ఎన్‌డీఏ, యూపీఎస్సీ తరగతులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ పిల్లలకు నాణ్యమైన విద్య అందించకుండా జరుగుతున్న కుట్రలో భాగమే కళాశాల తరలింపు అని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పేరెంట్స్ కమిటీ జాయింట్ సెక్రటరీ డి. తిరుమలేష్, స్వరూపారాణి తదితరులు ఉన్నారు.


ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి పత్రం ఇస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు

## నకిలీ విత్తనాల కేసులో నిందితుల రిమాండ్

సూర్యాపేటటౌన్: నకిలీ పత్తి విత్తనాల కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. సూర్యాపేట డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న ఆత్మకూరు(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రాం బస్ స్టేజీ వద్ద సీసీఎస్, ఆత్మకూరు(ఎస్) పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన తండా నగేష్‌తో పాటు మరో ముగ్గురిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో పరారీలో ఉన్న అరుణోదయ విత్తనాల తయారీ సంస్థ ఎండీ సాంబశివరావు, మరో నిందితుడు చెవుల నరసింహులును శనివారం ఏపీలోని కర్నూలు జిల్లా కొసగి మండలం పల్లిపాడు వద్ద వ్యవసాయ క్షేత్రంలో అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి విత్తనాలకు కలరింగ్ చేసే మిషన్, వేయింగ్ మిషన్, ప్యాకింగ్ హీట్ మిషన్, ఖాళీ ప్యాకెట్లు, రెండు కిలోల లూజ్ నకిలీ పత్తి విత్తనాలు, బొలేరో వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

## ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పోచంపల్లి మండలం జూలూరులో శనివారం జరిగింది. వివరాలు.. జూలూరు గ్రామానికి చెందిన యాకరి యాదయ్య, సుశీల దంపతుల పెద్ద కుమారుడు ప్రశాంత్ (30) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి వివాహం కాలేదు. శనివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లి ఇంటికి వచ్చిన ప్రశాంత్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఇంటికి వచ్చేసరికి ప్రశాంత్ ఉరికి వేలాడుతుండటం గమనించి ఇరుగుపొరుగు వారి సహాయంతో ప్రశాంత్‌ను కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని విచారిస్తున్నారు. ప్రశాంత్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.


ప్రశాంత్ (ఫైల్)


## మినీ శిల్పారామంలో నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలోని పెద్ద చెరువు వద్ద గల మినీ శిల్పారామంలో శనివారం ప్రత్యేక ఆఫీసర్ కిషన్‌రావు ఆధ్వర్యంలో చిన్నారులచే నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. సందర్శకులు నృత్య ప్రదర్శనను తిలకించి ఆనందించారు.

## జలనారాయణస్వామికి మంగళహారతులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి జలనారాయణస్వామికి మంగళహారతుల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం, మధ్యాహ్నం సుమారు 4వేల మందికి అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


మంగళహారతులు ఇస్తున్న అర్చకులు

## విజ్ఞానంతో సామాజిక అంతరాలు దూరం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

భువనగిరిటౌన్: సమాజంలో విజ్ఞానం ద్వారా మాత్రమే సామాజిక అంతరాలు దూరమవుతాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన పూలే, అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్థానిక వెటర్నరీ శాఖ సమావేశం హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కలెక్టర్ హనుమంతరావుతో కలిసి పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. మహనీయుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే చోటు నాలెడ్జ్ సెంటర్ మాత్రమే అని అన్నారు. జ్యోతిరావు పూలే, అంబేద్కర్‌ల సామాజిక ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పేర్కొన్నారు. నాలెడ్జ్ సెంటర్ ద్వారా భవిష్యత్ తరాలకు మంచి విజ్ఞానాన్ని అందించాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. సమాజంలో సామాజిక పరివర్తన తీసుకురావడం కోసం పూలే, అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ నిత్యం దినపత్రికలు చదవాలని అన్నారు. నాలెడ్జ్ సెంటర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు కావాలని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీ మాట్లాడుతూ.. నాలెడ్జ్ సెంటర్లను ప్రోత్సహించేందుకు తప్పకుండా సహకారం అందిస్తామని అన్నారు. నాలెడ్జ్ సెంటర్‌కు ప్రతిరోజు దినపత్రికలు అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు. బానోతు భాస్కర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీనియర్ జర్నలిస్ట్ ఎస్. మల్లారెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, మాజీ కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, సంతోషిమాత దేవాలయ కమిటీ సభ్యుడు నాగరం శంకర్, మాజీ కౌన్సిలర్ బట్టుపల్లి అనురాధ, నిర్వాహకులు స్వరూప, సురుపంగ శివలింగం, దొడ్డి యాదగిరి, బొట్ల రమేష్, నాయకులు ఇటుకల దేవేందర్ మాదిగ, మేడి కోటేష్, రాము, అందె సాయి, రమేష్ కోటి, ఎస్. జైపాల్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం. సత్తయ్య, లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రాజునాయక్, రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌నాయక్, నర్సింహనాయక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గద్దం వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య, చిత్రంలో కలెక్టర్ హనుమంతరావు తదితరులు

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం కట్టంగూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్ధాలతో కాలం గడుపుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రైతు భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సీజన్‌లోనైనా రైతులకు రావాల్సిన రైతు భరోసా పూర్తిగా అందజేయాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. మన నీళ్లపై హక్కులు రాసివ్వడానికి తెలంగాణ ఏమైనా సీఎం జాగీరా అని ప్రశ్నించారు. గోదావరి బేసిన్‌లో 1000 టీఎంసీలు, కృష్ణా బేసిన్‌లో 500 టీఎంసీలు తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చి.. మిగతావి ఏపీ ఎన్ని నీళ్లయినా దోచుకుపోవచ్చని సీఎం చెప్పటం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అజ్ఞానంతో తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం తన చిల్లర మాటలతో రాష్ట్ర ప్రజల ముందు పరువు తీసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, పోగుల నర్సింహ, నోముల వెంకటేశ్వర్లు, శ్రీపాద రామకృష్ణాచారి, పోగుల నర్సింహ, అంజయ్య, మల్లేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య